# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏర్పాటు చేయనున్న హార్టీకల్చర్ హబ్ కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణలతో కలిసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఈ రోజు శంఖుస్థాపన చేయనున్నారు.**

**2. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రెండు కరువు భత్యాలను మంజూరు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.**

**3. ఆక్వా పరిశ్రమలు కచ్చితంగా కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలను పాటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఆదేశించారు.**

**4. కోనసీమ ప్రాంతంలోని కొటిపల్లి--నరసాపూర్ కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.**

==========================

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు రాష్ట్రంలో పర్యటించనున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న హార్టీకల్చర్ హబ్ కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణలతో కలిసి ఆమె ఈ రోజు శంఖుస్థాపన చేయనున్నారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు పనులకు వీరు శంఖుస్థాపన చేయనున్నారు. గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ తో రాయలసీమ రూపురేఖలు మారిపోనున్నాయని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 32

--------------------------

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రెండు కరువు భత్యాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాదు సచివాలయంలో నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై ఏటా సుమారు 2 వేల 500 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో సుదీర్ఘంగా

చర్చించారు. ప్రస్తుత వర్షాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 శాతం వర్షపాతం లోటు ఉందని దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రికేయులకు వెల్లడిస్తూ..

వాయిస్.. 35

---------------------------

ఆక్వా పరిశ్రమలు కచ్చితంగా కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలను పాటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారుల సంఘం ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం, సహజ జలవనరుల పరిరక్షణ ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతగా వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణపట్ల అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ఆక్వా వ్యర్థాల కారణంగా సహజ నీటి వనరులు, భూగర్భజలాలు కాలుష్యం బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి పరిశ్రమ నిర్దేశిత ప్రమాణాలను తప్పక పాటించాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

కోనసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన కోటిపల్లి--నరసాపూర్ కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు రాష్ట్ర వాటా కింద అదనంగా ఈ నిధులను విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర రైల్వే శాఖతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 25 శాతం నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భూసేకరణ, నిర్మాణ పనుల వ్యయాలు కూడా రాష్ట్ర వాటాలో భాగమని పేర్కొన్నారు. గతంలో భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చులను కూడా రాష్ట్ర వాటా కింద పరిగణనలోకి తీసుకునేందుకు రైల్వే శాఖ అంగీకరించిందని మంత్రి తెలిపారు.

---------------------------

12వ వేతన సవరణ కమిషన్(పిఆర్‌సి) కమిషనర్‌గా ప్రభుత్వ విశ్రాంతి ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ నిన్న విడుదల చేశారు. 2023 జూన్ 30వ తేదితో 11వ పిఆర్‌సి గడువు ముగిసిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా విజయవాడలో నగరంలో ఈ రోజు 'స్వచ్ఛథాన్--2026' పరుగును నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో జరగతున్న ఈ కార్యక్రమం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈ రోజు తెల్లవారుజామున 5 గంటలకు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హాఫ్ మారథాన్, 10కే, 5కే రన్‌లు నిర్వహిస్తున్నారు. ఈ రన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

-------------------------

సత్యాగ్రహం, అహింసా, శాంతి అనే పదునైన ఆయుధాలతో బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించి పెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. 1869వ సంవత్సరంలో గుజరాత్ రాష్ట్రంలోని పోరుబందర్ పట్టణంలో అక్టోబర్ 2వ తేదీన జన్మించిన మహాత్మాగాంధీ... భారత స్వాతంత్ర్య పోరాటాన్ని శాంతియుతంగా ముందుండి నడిపించి... యావత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచారు. అందుకే... మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2ను ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా కూడా నిర్వహిస్తున్నాయి. భారతదేశం చేసిన విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ 2007 సంవత్సరంలో గాంధీ జయంతి అయినఅక్టోబర్ 2వ తేదీని “అంతర్జాతీయ అహింసా దినోత్సవం” గా పాటించాలని ప్రకటించింది. భారత మాజి ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని కూడా ఈ రోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

-------------------------

డిఎస్సి రెండవ విడత నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ అధికారులతో నిన్న నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నోటిఫికేషన్ విడుదల నుంచి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇచ్చే వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ‘మిషన్ మార్చ్’ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానిన పిల్లలు భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడటం, అనేక సామాజిక సమస్యలకు దారితీస్తున్న విషయాన్ని అధికారులు పరిగణలోకి తీసుకోవాలని మంత్రి వెల్లడించారు.

-------------------------

ఉత్తర కోస్తా, తమిళనాడు పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఉత్తర-దక్షిణ ద్రోణి ఉత్తర అంతర్గత కర్ణాటక నుండి మన్నార్ గల్ఫ్ వరకు అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా విస్తరించి ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాంలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..18

తెలంగాణ రాష్ట్రంలో ఈ రోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

-------------------------

రాష్ట్రంలో కరవు మండలాలను గుర్తించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాదులోని సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో రైతులు పండించిన పంటలను కేంద్ర ప్రభుత్వం వంద శాతం కొనుగోలు చేయాలన్నారు. కేంద్రం నిర్దేశించిన కరవు నిర్వహణ మార్గదర్శకాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

=====================